# గిజుభాయి

సమగ్ర సాహిత్యం

1





## పగటి కల

## తల్లిదండ్రులకు

## తల్లిదండ్రుల ప్రశ్నలు

ప్రజాశక్తి బుక్‌హౌస్

# గిజూభాయి సమగ్ర సాహిత్యం

# 1

## పగటి కల
## తల్లిదండ్రులకు
## తల్లిదండ్రుల ప్రశ్నలు

ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013

తెలుగు : ఎ.జి. యతిరాజులు

ప్రచురణ సంఖ్య : 951

ప్రథమ ముద్రణ : జూలై, 2005

వెల : రు. 80/-

టైటిల్ : శ్రీరామ్ కారంకి

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి

హైదరాబాద్-20. ఫోన్ : 27660013

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ,

విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# విషయసూచిక

ముందుమాట ................................ 5

విద్యారంగానికి గిజుభాయి సేవలు ........ 7

గిజుభాయి జీవిత ఘట్టాలు ............... 24

**(I) పగటి కల**

పరిచయం .................................. 27

దిక్సూచి .................................... 30

ప్రయోగాల ప్రారంభం ..................... 39

ప్రయోగ ప్రగతి ............................ 59

ఆరుమాసాల చివర ........................ 75

పాఠశాల వార్షికోత్సవం.................. 101

**(II) తల్లిదండ్రులకు**

భూమిక ................................... 117

సమర్పణ ................................. 123

వైవాహిక జీవన సాఫల్యం ............... 124
సంతాన మహిమ ......................... 130
మన బాలల మేలు కొరకు .............. 134
కుటుంబంలో బాలుడి స్థానం ఏమిటి? 137
పిల్లలు ఇళ్ళల్లో ఏమి చేయాలి? ......... 144
తల్లిదండ్రులు ఏమి చేయాలి ............ 156
తల్లులకు .................................. 174
సంపన్నులకు .............................. 186
అసంపూర్ణ బాలుడు ...................... 192
పిల్లలు ఆడుకొనే చెడు ఆటలు .......... 201

**(III) తల్లిదండ్రుల ప్రశ్నలు**

నేపథ్యం .................................... 211
రెండుమాటలు ............................ 213
తల్లిదండ్రులకు ప్రశ్నలు .................. 214

# ముందుమాట

పుట్టినప్పటి నుండి మన పిల్లలు, దాని తరువాత తమ తల్లిదండ్రుల నుంచి, తమ కుటుంబం నుంచి వారు పడే కష్టాలు, పొందే వేదనలు, బాధలు, దుఃఖాలు ఇన్నీ అన్నీ కావు. మన పిల్లలు ఎలాంటి నేరగాళ్ళు కారు. వారు అత్యంత అమాయకులు. అయినా మనం మన అజ్ఞానంచేత, తెలివిలేని తనం చేత, మనకు సాధారణంగా వున్న బలహీనతల చేత, మన పిల్లలనే రాత్రింబవళ్ళు వేధిస్తూవుంటాము. బాధలు పెడుతూ వుంటాము. 24 గంటలూ వారిని తిరస్కార భావంతో చూస్తాము, మాటిమాటికీ అవమానిస్తూవుంటాము. కొడుతూ, తిడుతూ వారి జీవితాన్ని నరకప్రాయం చేస్తూవుంటాము. వీటన్నిటినీ ఒక మంచి రచయిత గ్రంథస్థం చేస్తే అది ఓ మహా విషాద కావ్యంగా పరిణమిస్తుంది. దాన్ని చదివిన సహృదయతగల ఎవరైనా కంట తడి పెట్టకమానరు. ఏడవకుండా ఉండలేరు. అంతెందుకు? మనల్నే తీసుకుందాం.. ఒక్కసారి ఆలోచిద్దాం.. మన పిల్లలను మనము చీటికీ మాటికీ తిడుతున్నామా లేదా? కొడుతున్నామా లేదా? చెప్పిన మాట వినలేదని దండిస్తున్నామా లేదా? మరీ మనకు కోపము హెచ్చితే ఇంటి నుంచి వారిని తరిమిగొడుతున్నామా లేదా? వీటికి ఏమైనా హద్దూ పద్దూ ఉందా? సాధారణంగా మన ఇళ్ళల్లో పెద్దవాళ్ళమైన మన చేతులే పైన ఉంటాయి. కానీ పాపం పిల్లలు బిక్కు బిక్కుమని అమాయక చూపులతో ఇంటిలోని ఒక మూలలో ఒదిగి పడిఉంటారు.

అలాంటి అసంఖ్యాకమైన పిల్లలకు రక్షకుడుగా ఆవిర్భవించిన గుజరాతీ మహోపాధ్యాయుడు గిజూభాయి బధేకా అక్కడ పిల్లల మనోహరమైన శిక్షణా సంస్థ స్థాపించి మాంటిసోరీ పద్ధతిలో నవీన బోధనకు శ్రీకారం చుట్టారు. అదీగాక తల్లిదండ్రులకు, నూతన ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా సుమారు 17 ఉత్తమ పుస్తకాలను కూడా రచించారు. వీటిలో బాల మనస్తత్వ శాస్త్రం, వారి పెంపకం, వారి శిక్షణ, ప్రేమపూర్వకంగా వాత్సల్యంతో నిండి ఎలా చేయాలో మనకు ప్రబోధించారు. ఈ పుస్తకాలన్నింటినీ తెలుగు ప్రజలకు సమర్పించటానికి ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ అభ్యుదయ సాహిత్య కేంద్రమైన ప్రజాశక్తి బుక్ హౌస్ నడుం కట్టింది. ఇందుకు ప్రజాశక్తి బుక్ హౌస్ ఆనందించడమేగాక గర్విస్తున్నది కూడా. మన తెలుగు పిల్లల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఈ పుస్తకాలు కరదీపికలుగా వెలుగొందుతాయి.

గిజూభాయి పుస్తకాల వివరాలు:

★ పగటికల
★ తల్లిదండ్రులకు
★ తల్లిదండ్రుల ప్రశ్నలు
★ తల్లిదండ్రులు కావడం కఠినం
★ తల్లిదండ్రుల తల నొప్పి
★ ప్రాథమిక పాఠశాలలో భాషా శిక్షణ
★ ఉపాధ్యాయులు అయినప్పుడు
★ బాలల శిక్షణ.. నా భావనలు
★ ప్రాథమిక పాఠశాలల్లో బోధనా పద్ధతులు
★ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు
★ ప్రాథమిక పాఠశాలలో లేఖా వాచనం
★ మాంటిసోరి పద్ధతి - భాగం-1
★ మాంటిసోరి పద్ధతి - భాగం-2
★ ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ - భాగం-1
★ ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ - భాగం-2
★ కథా బోధనా పద్ధతి
★ ఆడుతూ.. పాడుతూ...

ఈ పుస్తకాలలో 'మాంటిసోరి పద్ధతి', 'పగటికల', 'కథా బోధనా పద్ధతి' అత్యంత విలక్షణమైనవి. విద్యారంగంలో ఈ మూడు పుస్తకాలు చాలా మౌలికమైనవని భావింపబడుతాయి. ఇవి గిజూభాయి విద్యారంగానికి ఇచ్చిన కానుకలుగా విరాజిల్లుతున్నాయి. వీటిలో బాలల రక్షకుడైన గిజూభాయి తన మేధస్సును, మనస్సును పూర్తిగా మేళవింపుచేశారు. వీటిని చదివిన వారు బాలల శిక్షణను పూర్తిగా అర్థం చేసుకుంటారు. వీటిలో మాటిమాటికీ చదివి వాటిలోని మర్మాన్ని గ్రహించగలిగే ఎన్నో అంశాలు నిండివున్నాయి. ఇవి బాలల జీవితాలను లోతుగా అధ్యయనం చేయడానికి దోహదపడతాయి.

ఈ అన్ని పుస్తకాలు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తమ బాలలకు సంబంధించిన పరిజ్ఞానాన్నీ, శిక్షణా పద్ధతులను సమగ్రంగా అందిస్తాయి కనుక వారు వీటిని ఆదరించి ఆచరణలో తమ పిల్లలను మంచి పద్ధతిలో పెంచుతారని ఆశిస్తున్నాం. గిజూభాయి కూడా తన పాఠకుల నుంచి దీనినే ఆశించారు.

గిజూబాయి రచనలు కొన్ని ఇప్పటికే తెలుగులో వెలువడ్డాయి. వాటిలో అత్యధికం సంక్షిప్త రూపంలోనే ఉన్నాయి. ఇప్పుడు మొట్టమొదటిసారిగా గిజూబాయి సమగ్ర సాహిత్యాన్ని తెలుగులో అందిస్తున్నాం. ఈ అనువాదాలకు మూలం రాజల్ దేసర్ (రాజస్థాన్)లోని మాంటిసోరి బాల శిక్షణా సమితి హిందీలో ప్రచురించిన 17 భాగాల సంకలనం. పాఠకుల సౌలభ్యం కోసం వాటిని 7 సంపుటాలుగా ప్రచురిస్తున్నాం.

**హైదరాబాద్,**
**తేది:03-07-2005** **- ప్రజాశక్తి బుక్ హౌస్**

# విద్యారంగానికి గిజూభాయి సేవలు

**రాంనరేష్ సోనీ**

గిజూభాయి అనే పేరు వినగానే మన కళ్ళ ఎదుట ఒక వ్యక్తి వచ్చి నిలబడతారు. ఆయనకు విద్య అంటే ఆపారమైన అభిమానం. ఆయన విద్య యొక్క నిజమైన శక్తిని గుర్తించిన వారు. విద్య ద్వారా ఎన్నో మంచి మార్పులు తేవచ్చునని నమ్మిన వారు. ఉపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిత్వాన్ని చక్కటి రీతిలో తీర్చిదిద్దగలవారు అని నమ్మిన వారు. విద్య ద్వారా సమాజంలోని ఎన్నో దుర్గుణాలను మాపవచ్చునని దృఢంగా విశ్వసించిన వారు ఆయన.

గిజూభాయి పేరు వినగానే నా ఎదుట ఒక సాధారణమైన వ్యక్తి, అయితే అదే సమయంలో ఒక అసాధారణమైన ఉపాధ్యాయుడు వచ్చి నిలబడతాడు. విద్యారంగంలో నెలకొని వున్న ఎన్నో మూఢనమ్మకాలు, గుడ్డి పద్ధతులు, విచక్షణలేని నియమనిబంధనలు మొదలగు వాటి నుంచి విద్యార్థులను విముక్తి చేసిన వారు అయన. కఠినతరమైన పాఠశాల వ్యవస్థను అతి సరళమైనదిగా మార్చిన వారు ఆయన. స్కూలు సిలబస్‌కు సవాల్ విసిరిన వారు ఆయన. గిజూభాయి బాలల కొరకు నిజమైన జీవితాన్ని ప్రసాదించగల, విముక్తికలిగించగల విద్యా విధానం ప్రతిపాదించారు.

నావరకు అయితే గిజూభాయి పేరు ఎంతో వివేకవంతుడైన, ప్రయోగనిష్టుడైన, సాహసపరుడైన ఉపాధ్యాయుని పేరుగా కనిపిస్తుంది. ఆయన జీవితం పూర్తిగా పిల్లలకు అంకితం చేయబడింది. ఆయన ఎల్లప్పుడు బానిస మనస్తత్వాన్ని బద్ధలు కొట్టుకుని స్వేచ్ఛ, సృజనాత్మకత సమర్ధిస్తూవుండేవారు. ఆయన కేవలం విద్యకు సంబంధించిన సిద్ధాంతాలు మాత్రమే వల్లెవేస్తుండేవారు కారు. చైతన్య రహితమైన విదేశీ విద్యా విధానాన్ని కూడా ఆయన అంగీకరించరు. విద్యాబోధన విషయంలో ఆయన పరిశీలనకు, ప్రయోగానికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చారు. కాగా ఆచరణాత్మక సిద్ధాంతాలను కఠినంగా అమలు పరచారు. దీని అర్థం ఏమిటంటే వారు కేవలం సిద్ధాంతవేత్తకారు. ఆచరణకు ప్రాధాన్యతనిచ్చే గట్టి మానవతావాది.

గిజూభాయి సరళతలోనే ఆయన అసాధారణత్వం నిండి వుంది. ఎందుకంటే ఎల్లప్పుడూ ఆయన చూపు మానవ జీవితానికి సంబంధించిన పునాది సమస్యలపైనే నిలచి వుండేది. ఆయన రూపొందించిన శిక్షణ కేవలం శిక్షణ కొరకు కాదు. రూపం, రంగులు లేని, ఏకరసమైన, విసుగు జనింపజేసే శిక్షణ కాదు ఆయన ప్రతిపాదించింది. ఒక ఉద్దేశ్యంతో కూడిన, ఒక ప్రయోజనం నిండిన, సరసమైన, తాజా శిక్షణను ఆయన ప్రతిపాదించారు.

గిజూభాయి ఎన్నో చిక్కు సమస్యలను పరిష్కరించారు. అయినా కొందరు 'ఇందులో గొప్పదనం ఏముంది, నేను కూడా ఇలాంటి పని చేయగలనులే' అని చెప్పుకోవచ్చు. కాని వారు మాటలయితే చెప్పగలరు కాని ఆచరించి చూపలేరు. ఆచరించి సఫలీకృతులైతే అంతకంటే కావలసిందేముంది? ఆ ఆచరణ బాలలను భయపెట్టేదిగా వుండరాదు. ప్రేమతో లాలించి చదువుచెప్పే విధంగా వుండాలి. అదే సమయంలో వారికి క్రమశిక్షణ కూడా అలవరచాలి. గిజూభాయి గారు ఈ సిద్ధాంతాన్ని విద్యారంగానికి తన కానుకగా సమర్పించారని చెప్పుకోవచ్చు.

ఎవరి హృదయంలోనైనా ఒక పని సాధించి తీరాలనే దృఢసంకల్పం కలగకపోతే, వారు అత్యంత నిష్ఠతో, అత్యంత అంకిత భావంతో రాత్రింబవళ్ళు అందుకే కృషి చేస్తూవుండకపోతే, వారు గౌతమ బుద్ధులు, మహ్మద్, మహాత్మాగాంధీ, మాంటిసోరి లాంటి మహనీయులలా కృషి చేయకపోతే ఏ గొప్ప విజయం కూడా సాధించలేరనే సత్యం మనందరికీ తెలిసిందే. వీరి ప్రక్కన గిజూభాయి పేరు నేను చేర్చలేకపోయినా ఆయన హృదయావేశం, ఆయన దృఢసంకల్పం, ఆయన ఆలోచనా తీవ్రత, ఆయన పరివర్తనాశక్తి నిస్సంశయంగా ప్రసంశనీయాలు.

గిజూభాయి ఒక న్యాయవాదిగా తన జీవితం ప్రారంభించారు. చక్కగా నడుస్తున్న తన ప్రాక్టీసును వదలి చిన్నారుల కోసం పరితపించాల్సిన అవసరం ఏమిటి? ప్రస్తుతంలాగా ఆ కాలంలో విద్యాలయాలు స్థాపించడం లాభార్జనకు కాదు. విద్యాలయాల ద్వారా డబ్బులు సంపాదించలేని పరిస్థితి ఆనాడు. ఆ నాడు ఈనాటిలా విద్యా వ్యాపారం జరుగుతుండలేదు. ఇక్కడ పేర్కొనవలసిన విషయం ఏమంటే గిజూభాయి తండ్రి భగవాన్జీ బధేకా గారు ఉపాధ్యాయులుగా వుండి, న్యాయవాదిగా మారారు. ఈయనేమో న్యాయవాదిగా వుండి ఉపాధ్యాయునిగా పరిణమించారు. తన ఆర్థిక లాభాలు కూడా పూర్తిగా వదలుకున్నారు. బాలల బోధనలో వున్న అత్యధిక ఆకర్షణ ఏమిటో ఆలోచించండి. గిజూభాయికి ఇందులో గొప్ప ఆకర్షణ కనబడి వుండవచ్చు, అందువల్లే తన న్యాయవాది వృత్తిని వదలి పిల్లల శ్రేయోభిలాషిగా మారిపోయారు. ఇందుకు రెండు కారణాలు వుంటాయనుకుంటాను. గిజూభాయి తన చిన్నతనంలో స్కూలు విద్యలో ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు, బాధలు. ఆయన చిన్నతనంలో పాఠశాలలో పిల్లలను బాగా కొడుతుండేవారు. ఉపాధ్యాయులు వారి పట్ల రాక్షసంగా ప్రవర్తించేవారు. స్కూల్ మాత్రమే కాదు ఇంటికి వచ్చినా అక్కడ కూడా పిల్లలను తల్లిదండ్రులు బాదుతూవుండేవారు. పిల్లల ఇష్టాయిష్టాలకు ఎక్కడా విలువనిచ్చేవారు కాదు. పెద్దలు వారికి ఎల్లప్పుడూ ఆజ్ఞలు జారీ చేస్తూవుండేవారు. లేకపోతే ఉపదేశాలతో

హడలుగొడుతూవుండేవారు. ఇవన్నీ గిజూభాయికి గుర్తు వచ్చివుండవచ్చు. రెండవ పెద్ద కారణం ఏమిటంటే వారి ఇంటిలో కుమారుడు జన్మించాడు. వాడికి మంచి విద్యను అందించాలనే తపన ఆయనలో ప్రారంభమైంది.

దీనికి సంబంధించి గిజూభాయి తన పుస్తకాల్లో అక్కడక్కడా ప్రస్తావించారు. వారి చిన్న తనంలో పాఠశాలలో ఎలాంటి విద్యా బోధన జరుగుతూవుండేది పేర్కొన్నారు. ఆయన స్వయంగా వివరించిన దానిని బట్టే ఆయన మనస్సుపై ఆనాటి పరిస్థితులు ఎలాంటి చెడు ప్రభావం కలిగించాయో మనం అర్థం చేసుకొవచ్చు. ఆ చెడు ప్రభావం నుంచి రాబోయే తరాలనైనా రక్షించాలనే ఉద్దేశ్యంతో తన బోధనా పద్ధతులను ఆవిష్కరించారు . ఒక సారి పిల్లల సంరక్షకుల సభలో ఆయన ఇలా అన్నారు,

'.....చేతిలో బెత్తం పట్టుకుని తరగతి గదిలో తిరుగుతూ పిల్లల చేత ఎక్కాలు బట్టీ పట్టించే ఉపాధ్యాయుడు మీకు జ్ఞాపకం వస్తున్నాడా లేదా? మట్టి, మురికి నిండిన ఆ పాఠశాలలో, ఆ తరగతి గదిలో క్రిక్కిరిసి కూర్చొన్న పిల్లలు మీకు గుర్తు వస్తున్నారా? వారు అక్కడ పిల్లల్లా కనబడలేదు. బందెల దొడ్డిలో క్రిక్కిరిసివున్న పశువుల్లా కనబడతున్నారు. ఆ పిల్లల చేతిలో పలకా బలపాలు వున్నాయి. మురికి బట్టలతో వున్న వారు తమ పలకలపై ఎంగిలి ఊసి శుభ్రపరుస్తున్నారు. తమ ఉపాధ్యాయుడ్ని ఓరకంటితో చూస్తున్నారు. ఇక ఆయన గారు ఏ పిల్లవాడిని కొడతారోనని ఎదురుచూస్తూ భయపడిపోతున్నారు. ఈ దృశ్యాలన్నీ మీకు జ్ఞాపకం వున్నాయి కదా?

నాకయితే ఈ దృశ్యాలు సిగ్గుపడేటట్లు వున్నాయి. పాఠశాల జీవితంలో ఎన్నో మధుర స్మృతులతో పాటు ఈ చేదు అనుభవాలు కూడా గుర్తుకొస్తున్నాయి. వీటిని మరచిపోవటానికి మధుర స్మృతులనే ఎక్కువగా స్మరించుకుంటూ వుంటాను. అయితే తరగతిలోనే గుట్కా తింటూవుండే ఉపాధ్యాయుడు, పిల్లలను ఎప్పుడూ తిడుతూవుండే ఉపాధ్యాయుడు, పిల్లల తల్లిదండ్రులను పరిహసిస్తూవుండే ఉపాధ్యాయుడు - ఇలాంటి వారిని మరచిపోవాలన్నా కూడా సాధ్యపడటం లేదు. అలాంటి ఉపాధ్యాయుడు పిల్లలపై పెత్తనం చెలాయించటానికే కొట్టేవాడు. ఆయనకు చదువు చెప్పడం రాకపోతే 'దేశ పటం చూడండి, ఎక్కాలు వ్రాయండి' అని ఏదో ఒక పని పిల్లలకు అప్పజెప్పేసేవాడు. పిల్లలను ఇష్టమొచ్చినట్లు చెంపదెబ్బలు కొట్టే ఉపాధ్యాయులను నేను చూశాను, అప్పుడప్పుడు నా చెంపలు కూడా ఉపాధ్యాయుని చేతిలో ఛెళ్ళుమన్నాయి. నిజం చెప్పాలంటే ఆనాటి ఉపాధ్యాయులకు పిల్లలతో ఎలాంటి సంబంధం వుండేది కాదు. ఎలాంటి ఆత్మీయత వుండేది కాదు. విద్యార్థులమైన మేము హోం వర్కు చేసి తెచ్చి ఇస్తే ఉపాధ్యాయుడు ఆగ్రహంతో వాటిని తీసుకునేవాడు. పాఠశాల వదలగానే మేము పంజరం నుంచి ఎగిరిపోయే పక్షుల్లా ఇంటి వైపు పరుగులు పెట్టేవాళ్ళము. ఎప్పుడైనా మా ఉపాధ్యాయుడు జబ్బు చేసి పాఠశాలకు రాకపోతే 'ఈ రోజు మంచి రోజు, చదవాల్సిన అవసరం లేదు' అని సంబరం చేసుకునేవాళ్ళం. ఏ నాయకుడైనా మరణించి సెలవిస్తే ఎగిరి గంతులేసి ఆనందంగా పరుగులు తీసేవాళ్ళం.

మేము మా ఉపాధ్యాయులను అనుకరించి ఆట పట్టించేవాళ్ళం. శ్రద్ధగా పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడంటే మాకు నచ్చదు. చదువేమి చెప్పకుండా కాలక్షేపం చేస్తూవుండే ఉపాధ్యాయుడంటే మాకు మహా ఇష్టం. ఎందుకంటే ఆయన పాఠం మేము కష్టపడి చదవాల్సిన అవసరం లేదు. పరీక్షలలో కాపీ కొట్టించే మాస్టరు అంటే మాకిష్టం. అడ్డుకునే ఉపాధ్యాయుడంటే మహా కోపం. పిల్లల చేత కాపీ కొట్టించే ఉపాధ్యాయుడు వారి భవిష్యత్‌ను ఎంతగా నాశనం చేస్తున్నాడో ఆ చిన్న తనంలో మాకు తెలిసేది కాదు.

విశ్వనాథ్ అనే పిల్లవాడు మాతో చదువుతూ వుండేవాడు. వాడికేమీ రాదు. మా ఉపాధ్యాయుడు వాడిపై ఎప్పుడూ ఆగ్రహిసస్తూ వుండేవాడు. వాడిని ఎల్లప్పుడూ కొడుతూవుండేవాడు.

ఉపాధ్యాయులు పాఠశాలలో పిల్లలను కొట్టేందుకు కొత్త కొత్త విధానాలు అవలంభించేవారు. పిల్లలను గుద్దడం, చెంపలు ఛెళ్ళుమనిపించడం, చెవి మెలేయడం, బెత్తంతో, స్కేలుతో కొట్టడం, ఇవన్నీ సామాన్య విధానాలు. ఇవి కాక మరి కొన్ని విధానాలు కూడా అవలంభించేవారు. పిల్లల చేతిని మేజాపై వుంచి స్కేలుతో కొట్టేవారు. మొట్టికాయలు వేయడం కూడా శాస్త్రబద్ధంగా చేసేవారు.

మా విద్య అంతా తెలుసుకోవడం, నేర్చుకోవడం చుట్టే వుండేది. జ్ఞానం, జ్ఞానం, జ్ఞానం! చరిత్ర సంఘటనలు సంవత్సరాల ప్రకారం మాకు గుర్తుండేవి. వడ్డీ లెక్కలు మిగతా గణితం కంఠస్థంగా వచ్చేవి. పద్యాలు, వాటి అర్థాలు కూడా జ్ఞాపకం వుండేవి. భౌతికశాస్త్ర సూత్రాలు, జీవశాస్త్ర సూత్రాలు కంఠతా వచ్చేవి. ఇన్ని విషయాలు గుర్తున్నా, వీటిలో ఎక్కడ అభివృద్ధి వుందో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. అయినా మా చదువు స్థాయి అదే.

మా పాఠశాల బోధనకు ప్రయోగశాల కాదు. అక్కడ ఆట స్థలంకానీ, నాటకరంగం కానీ, సంగ్రహాలయం కానీ లేదు. కళామందిరం లేదు, పూదోట లేదు, మొండి గోడలు, గుంతలమయమైన నేల, సిరా మరకలతో నిండిన బెంచీలు, విరిగిపోయిన పలకలు, చిరిగిపోయిన పుస్తకాలు, వీటి మధ్య మేము, మా మధ్య చేతిలో బెత్తం తీసుకుని అటూ ఇటూ పచార్లు చేసే ఉపాధ్యాయులు. ఇదే మా పాఠశాల.

అక్కడ మేమెన్నో నేరాలు చేస్తూవుండేవాళ్ళం. తప్పులు చేస్తూవుండేవాళ్ళం. మాలో మేము ఎల్లప్పుడు మాట్లాడుకుంటూ వుండేవాళ్ళం. పాఠశాల పని మాత్రం చేయము. పావురాలు ఎగరేస్తూవుండేవాళ్ళం. మాస్టరుగారి మేజా డ్రాను విప్పి ఏదైనా ఒక వస్తువు దొంగిలిస్తూవుండేవాళ్ళం. ఆయనను చాటుగా ఎగతాళి చేస్తూవుండేవాళ్ళం. మా ప్రక్కవాడికి మాస్టరు అడిగిన జవాబు తెలియకపోతే మా పలకలో వ్రాసి చూపించేవాళ్ళం. మాకు ఆటలాడుకోవాలనిపిస్తే పాఠంపై శ్రద్ధ చూపే వాళ్ళం కాదు. ఇటు అటు చూస్తూవుండిపోయే వాళ్ళం. మాస్టరు గారేమో బోర్డుపైన ఏదో వ్రాస్తూవుంటారు. అది మాకు అర్థమయ్యేది కాదు. ఆయన మమ్మల్ని తరగతి గది నుంచి మెడపట్టి గెంటేసేవారు. దండిగా హోంవర్కు ఇచ్చి మరునాటికి చేసుకుని రమ్మనేవారు. అయినా మేము హోంవర్కు చేయము. తలనొప్పి అని నాటకమాడేవాళ్ళం. ఒక్కోప్పుడు మాస్టరు గారి బెత్తాన్ని దాచేసేవాళ్ళం, లేకపోతే

ముక్కలుగా విరగ్గొట్టేసేవాళ్ళం. ఇవన్నీ మేము చేసిన ఘోర నేరాలుగా భావింపబడేవి. వీటికి కఠిన శిక్షలు కూడా విద్యాచట్టాన్ని అనుసరించి మాకు విధింపబడేవి. తరగతుల బయట ఎండలో నిలబెట్టేవారు. మాచేత గుంజిళ్ళు తీయించేవారు. చెంపదెబ్బలు కొట్టేవారు. ఎవరైనా పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లలను కొట్టే వివరాలు సేకరిస్తే అది ఒక పెద్ద 'అపరాధ సంహిత'(పీనల్ కోడ్)గా తయారవుతుంది.

గిజుభాయి స్కూలు జీవితానికి సంబంధించిన అనుభవాలు. ఇప్పుడు ఇళ్ళల్లో పిల్లలు ఎదుర్కొనే ప్రవర్తనలు కూడా చూద్దాం.

'...మీకు మీ బాల్యం గుర్తుందా! ఎన్నో సంవత్సరాల వెనుక గడచిపోయిన ఆ బాల్యాన్ని ఒక్క సారి జ్ఞాపకానికి తెచ్చుకోండి, జ్ఞాపకానికి వస్తోంది కదా. మేము అప్పుడు చిన్నవారుగా వుండేవారం. మమ్మల్ని ఇంటిలోని పెద్దవారు 'ఛోకరాలు'గా చూసేవారు. ఇంట్లో మాకు ఎలాంటి స్థానం వుండేది కాదు. ఇల్లు అనేది పెద్దలకే సొంతమయ్యేది. అందులో అందరూ క్రిక్కిరిసి వుండేవారు. పెద్దలకు అనుగుణమైన వస్తువులతో నిండిన ఆ ఇంటిలో పిల్లలమైన మేముకూడా ఎలాగో ఒకలాగా గడపాల్సి వుండేది. పెద్దలు వారికిష్టమైన వస్తువులతో ఇళ్ళను నింపేసేవారు. పిల్లల ఇష్టా ఇష్టాలను పట్టించుకునే వారు కాదు. పెద్దల మతం, కులం, ఆచార వ్యవహారాలకనుగుణంగా మేము కూడా మా మతాన్ని, మా ఆచార వ్యవహారాలను, మా ఆలోచనలను తీర్మానించుకోవలసి వుండేది. పెద్దలు మాట్లాడుకునేటప్పుడు మేము ఒక మూలన నిశ్శబ్ధంగా కూర్చొని వుండవలసి వచ్చేది. వారు భోజనాలకు కూర్చొన్నప్పుడు వారితో పాటే మేము కూడా బలవంతంగా తినవలసి వచ్చేది. మా ఇంటికి ఎవరైనా అతిధులు వచ్చినప్పుడు వారి ఎదుట మేము అతి వినయం ప్రదర్శించాల్సి వచ్చేది. వారిని సంతోషపరచేందుకు మేము పద్యాలు, పాటలు నేర్చుకుని వుండవలసి వచ్చేది.

మనమందరం చిన్నప్పుడు పిల్లవాళ్ళుగా వున్నాం, అందువల్ల తల్లిదండ్రులకు మనం బొమ్మలు లాగానే కనబడ్డాం కదా. మన తల్లిదండ్రులు వారి సంతృప్తి కొరకు వారికిష్టమైన బట్టలే మనకు తొడిగేవారు. వారి సరదాల ప్రకారమే మనకు తిండి తినిపించేవారు, వాహ్యాళికి తీసుకెళ్ళేవారు, మనచేత ఆటలాడించేవారు. బంధువులు, మిత్రులు వచ్చినప్పుడు వారి ఎదుట మనల్ని ప్రదర్శింపజేసి సంతృప్తి చెందేవారు. అలా తమ గౌరవాన్ని పెంపొందించుకునే వారు. మనల్ని తమతో పాటు ఎక్కడికైనా బయటకు తీసుకెళ్ళినప్పుడు తమ గౌరవప్రతిష్టలు కాపాడుకోవడం కోసమే మనల్ని కృత్రిమంగా అలంకరించేవారు. ఇతరులతో పోటీ పడేందుకే మన పెద్దలు మనకు కూడా అనవసరమైన ఆట బొమ్మలు కొని పెట్టేవారు.

చిన్నతనంలో మనం మన తల్లులతో పాటు వంటగదిలో వంట పనుల్లో తల దూరుస్తూవుండేవాళ్ళం. అమ్మ చపాతీలు రుద్దుతూ వుంటే మనం గోధుమ పిండితో చిన్న చిన్న బొమ్మలు చేస్తూవుండేవాళ్ళం. అమ్మకు కోపం వచ్చి గరిటతో మనల్ని కొట్టేది. మన నాన్న గారు మనల్ని ఏదైనా ఒక నాటకం చూడటానికి తీసుకెళ్ళితే ఇంటికి తిరిగి వచ్చిన

తర్వాత మనకు కూడా అలాగే నాటకమాడాలని అనిపిస్తుంది. ఆ నాటకంలో అమ్మ చీరను తలపాగాగా చుట్టుకుంటాం. నాన్న సిరా బుడ్డీ నుంచి సిరాను తీసి మీసాలు గా దిద్దుకుంటాం. ఇవన్నీ మీకు కూడా గుర్తున్నాయి కదా. మనకు చిన్నప్పుడు బొమ్మలు గీయటానికి కాగితాలు, పెన్సిళ్ళు అందుబాటులో వుండవు. అయినా మనస్సులో బొమ్మలు గీయాలనే తపన నిండి వుంటుంది. వెంటనే మనం వంటగది గోడలపై బొగ్గుతో బొమ్మలు గీసేస్తాం. ఇందుకు పెద్దల దగ్గర దెబ్బలు కూడా తింటాం.

మనం మన ఇంటి వాకిట గుంతలు త్రవ్వుతాం. వరండాలో చిందరవందరగా పడి వున్న చెప్పుల జతలను వరుసగా పెడతాం. మేడ మెట్లపై గోల చేస్తూ జారుతాం, చెట్టు కొమ్మ ఊయలలో హాయిగా ఊగుతాం. ఇంటిలోని చిట్టి చెల్లెల ఊయలను పాడుతూ ఊపుతాం. ఇంటిని అలకటానికి అమ్మ తెచ్చిన పేడతో మనం పిడకలు చేసి ఎండబెడతాం. అయితే మనం ఇన్ని పనులు చేశామనే కృతజ్ఞతా భావం లేకుండా మన పెద్దలు అన్ని చోట్ల నుంచి మనల్ని తరిమికొట్టారు. ఎప్పుడూ 'నీ పాఠం నువ్వు చదువుకో పో' అని తరిమేశారు. ఇవన్నీ మీకు గుర్తుకొస్తున్నాయి కదా'.

ఈ విధంగా గిజూభాయి బాలల మనస్సులోని ఎన్నో ఆక్రందనలను, ఎన్నో విషయాలను, ఎన్నో ఆసక్తులను, ఎన్నో చిరాకులను మనముందుంచారు. వీటి ద్వారా ఆయన విద్యకు సంబంధించిన సిద్ధాంతాలు, బోధనా పద్ధతులు, మనస్తత్వశాస్త్రానికి సంబంధించిన ఎన్నో అంశాలను తెలియజేశారు.

పైన పేర్కొన్న ఉదాహరణల ద్వారా గిజూభాయి గారి అంతరంగం పిల్లల కోసం ఎంతగా పరితపించి పోయిందో మనం అర్థం చేసుకోవచ్చు. ఆయన రాత్రింబవళ్ళు బాలల గురించే ఆలోచించేవారు. ఆయన పరిశీలనాశక్తి, ఆయన కార్యకలాపాలు, ఆయన రచనాప్రక్రియ, ఆయన ఉపన్యాసాలు, అన్నీ కూడా బాలలను కేంద్ర బిందువులుగా చేసుకునే నడిచాయి. వాస్తవానికి ఆయన బాలల శిక్షణను ఒక ఆరాధనగానే స్వీకరించారు. ఒక అంకితభావం కలిగిన ఉపాధ్యాయుడుగానే ఆచరించారు. ఆయన చెవులలో ఎల్లప్పుడూ పిల్లల ఏడ్పులు వినిపిస్తుండేవి 'అయ్యా, మేము కూడా మనుషులం, మా వైపు కూడా కన్నెత్తి చూడండి, మా మాటలు వినండి, మాకు న్యాయం చేకూర్చండి. మమ్మల్ని గౌరవించండి, మా తల్లిదండ్రుల అజ్ఞానం నుంచి, బూటకపు ప్రేమ నుంచి మమ్మల్ని రక్షించండి. మా స్వేచ్ఛ కోసం సంఘర్షించండి' అని పిల్లలు చెబుతున్నట్టుగా గిజూభాయికి అనిపిస్తూవుండేది. అందువల్లే ఆయన బాలల న్యాయవాదిగా ప్రసిద్ధి చెందారు.

ఆయన బోధనా ప్రణాళికకు కేంద్రంగా బాలల స్వేచ్ఛ వుండేది. ఆయన మొదట ఒక ఆదర్శ విద్యాలయాన్ని కలలు కన్నాడు. అక్కడ పిల్లల స్వతంత్ర రాజ్యం విరాజిల్లాలనుకున్నాడు. అక్కడ పిల్లలు మాత్రమే అత్యంత ప్రముఖులుగా వుండాలనుకున్నాడు. అక్కడ భయం లేని వాతావరణం నెలకొని వుండాలనుకున్నాడు. ఆ వాతావరణంలో పిల్లలకు స్వేచ్ఛగా ఆడుకునే, పని చేసే అవకాశం వుండాలనుకున్నాడు. బలవంతంగా చదివించడం విద్యా బోధన కాదు. అది దండన మాత్రమే అవుతుంది. పిల్లలకు స్వయంగా చదువుకోవటానికి

ప్రేరణ కలిగించాలి. ఇందుకు మొదటి షరతు, పాఠశాలలో స్వతంత్ర వాతావరణం. ఇది లేకుండా సృజనాత్మకత రూపుదిద్దుకోదు.

గిజూభాయి విద్యాసంబంధమైన సిద్ధాంతాలు స్వతంత్రత, స్వావలంబన, స్వీయక్రమశిక్షణ, సృజనాత్మకత మొదలగు వాటిపై ఆధారపడ్డవి. తరతరాలుగా వస్తున్న, పిల్లలకు కష్టం కలిగిస్తున్న, పిల్లలకు శత్రువుగా వున్న, ఉపాధ్యాయులు కేంద్రంగా వున్న బోధనా పద్ధతికి బదులుగా ప్రేమ, వాత్సల్యాలతో నిండిన బోధనను ప్రారంభించాలని ఆయన కోరికగా వుండేది. అందులో బాలలకే కేంద్ర స్థానం వుండేది. అదృష్టవశాత్తు ఆ రోజుల్లోనే గిజూభాయి మాంటిసోరి గ్రంథం 'మాంటిసోరి మదర్'ను చదివారు. దాంతో ఆయన జీవితంలో ఓ కొత్త వెలుగు ప్రవేశించింది. మాంటిసోరి రచించిన అన్ని గ్రంథాలను ఆయన విస్తృతంగా అధ్యయనం చేశారు. ఆ సిద్ధాంతాల ఆధారంగానే గుజరాత్‌లోని భావనగర్‌లో 'దక్షిణామూర్తి బాలమందిరం' స్థాపించారు.

మాంటిసోరి లాగాను గిజూభాయి కూడా విద్య యొక్క అర్థం వికాసమనే భావించారు. అంటే మానవుడు సహజంగానే ఒక వికాసశీలుడైన జీవి. అతడు ఏ పనీ చేయకపోయినా కూడా పెరుగుతూనే వుంటాడు. అభివృద్ధి చెందుతూనే వుంటాడు. శిక్షణ ద్వారా అతడి అభివృద్ధికి ఒక దిశా నిర్దేశం ఇస్తే ఆ అభివృద్ధి నిర్మాణాత్మకంగా వుంటుంది. సమాజానికి ఉపయోగపడేదిగా వుంటుంది.

బాలల అభివృద్ధికి దోహదపడే కార్యకలాపాలకు, ప్రవృత్తులకు మాంటిసోరి లాగానే గిజూభాయి కూడా ప్రాధాన్యతను ఇచ్చారు. పిల్లలను ఎల్లప్పుడూ పరిశీలిస్తూవుండాలి, వారితో మాట్లాడుతూ వుండాలి, వారి అవసరాలను గుర్తిస్తూవుండాలి అనే విషయం ఆయన నొక్కి చెప్పారు. ఆయన ఇతర పాఠశాలల కార్యక్రమాలను నిశితంగా పరిశీలించి, తన విద్యాలయంలోని బాలలను పాఠ్యక్రమం నుంచి, కాలపట్టిక నుంచి విముక్తులు చేశారు. చదువుకునే పిల్లలను పట్టణ నాగరికులుగా చేయడం ఆయన అభీష్టం కాదు. వారిని నమ్మకమైన రాజభక్తులుగా తయారు చేయడం ఆయన ఉద్దేశ్యం కాదు. అందరినీ ధనవంతులు చేయడం ఆయన లక్ష్యం కాదు. అయితే వారిని మానవులుగా తీర్చిదిద్దడం మాత్రం ఆయన ధ్యేయం. అందువల్ల విద్యకు, పరీక్షలకు మానవ వికాసాన్నే ఆయన కొలబద్ధగా నిర్ధారించుకున్నారు.

'మానవ వికాసానికి అనుభవం ఆధారంగా వుండాలి. ఆ అనుభవం స్వతంత్రంగా పని చేయడంలో నిండి వుంటుంది. కనుక బాలల కోసం వైవిధ్యపూరితమైన ప్రవృత్తులను మనం అందుబాటులో వుంచాలి' అని ఆయన చెప్పారు. బాలల శిక్షణ అనేది కేవలం తరగతి గదిలో మాత్రమే జరిగేది కాదు. ఇళ్ళల్లో, కుటుంబాలలో , ప్రకృతి ఒడిలో, నలువైపులా వ్యాపించి వున్న వాతావరణంలో ఈ శిక్షణ అనేది జరుగుతుంది. గిజూభాయి గారు బాలల శిక్షణకు ఈ అన్నింటినీ ఉపయోగించుకున్నారు.

మానవుని విద్య అతడు ఏకత్వం, భిన్నత్వం, క్రమానుగతం వీటిని అర్థం చేసుకోవడంలోనే వుంది అని ఆయన నమ్మకం. అతడు తన వివేకాన్ని అర్థం చేసుకోవాలి, ఇతరుల అనుభవాలను బాగా అర్థం చేసుకోవాలి. కాని అదే సమయంలో కంటికి కనబడని

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Gijubhai+Samagrasahityam+1**

* * *